

మండలానికో బస్సు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ నెల 12న కేసరపల్లిలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి కార్యకర్తలు, నాయకులు వెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. టిడిపి, జనసేన, బిజెపిల నుంచి మండలానికి 50 మంది చొప్పున నియోజకవర్గంలో 200 మందికి అధికారులు పాస్‌లు జారీ చేశారు. వారందరినీ ప్రత్యేక బస్సుల్లో కేసరపల్లి తీసుకెళ్లి, తీసుకొచ్చే బాధ్యతను ప్రతి మండలానికి ఒక ఉద్యోగికి అప్పగించారు. ఉంగుటూరు మండలానికి వచ్చిన 50 పాస్‌ల్లో జనసేనకు 20, టిడిపికి 20, బిజెపికి 10 చొప్పున సర్దుబాటు చేసుకున్నామని టిడిపి మండలాధ్యక్షుడు పాతూరి విజయకుమార్ వెల్లడించారు. పాస్‌లు పొందిన వారంతా బుధవారం ఉదయం ఉంగుటూరు చల్లాలమ్మ గుడి వద్దకు చేరకున్నాక బస్సు బయలు దేరేలా చర్యలు తీసుకున్నామని పంచాయతీ విస్తరణాధికారి షంషుద్దీన్ వెల్లడించారు. ఉంగుటూరు మండల బాధ్యత నారాయణపురం సచివాలయం-2 గ్రేడ్-5 సెక్రటరీ సూరత్తుల దుర్గాధర్‌కు అప్పగించారు.

మంత్రి పదవులపై ఉత్కంఠ..!




రాత్రి వరకూ విడుదల కాని జాబితా
అనేక మంది పేర్లు చక్కర్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

బుధవారం కొలువుదీరనున్న కొత్త మంత్రివర్గంలో చోటు దక్కేదెవరికోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. ప్రమాణ స్వీకారం చేసే మంత్రుల జాబితాపై మంగళవారం రాత్రి వరకూ స్పష్టత రాలేదు. దీంతో జిల్లాలోని ఎంఎల్‌ఎల్లో ఎవరిని మంత్రి పదవి వరిస్తుందోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. వీరే మంత్రులు అంటూ సోషల్ మీడియాలో అనేక జాబితాలు చక్కర్లు కొడుతున్నప్పటికీ అధికారికంగా మాత్రం ప్రకటించని పరిస్థితి నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో టిడిపి నుంచి పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, బిజెపి నుంచి కామినేని శ్రీనివాస్, జనసేన నుంచి డిప్యూటీ స్పీకర్‌గా తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్లు జాబితాలో ఉన్నట్లు ఊహాగానాలు నడిచాయి. సీనియర్ నాయకులు పితాని సత్యనారాయణ, రఘురామకృష్ణంరాజుకు మంత్రి పదవులు ఇస్తారా.. లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి. పితాని, నిమ్మల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ పితానికి మంత్రి పదవిపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 2014, 2024 ఎన్నికల్లో పశ్చిమగోదావరి జిల్లా టిడిపికి కంచుకోటగా నిలిచింది. జిల్లాలోని అన్ని స్థానాలనూ టిడిపి కూటమినే గెలుచుకుంది. దీంతో జిల్లాకు మంత్రి పదవుల కేటాయింపులో ఎంతవరకూ ప్రాధాన్యత ఇస్తారనే చర్చ సాగుతోంది. కూటమిలోని మూడు పార్టీలకు ప్రాధాన్యత ఉంటుందా.. లేక టిడిపి ఎంఎల్‌ఎలకు మాత్రమే అవకాశం ఉంటుందా అనేది తేలాల్సి ఉంది. పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడుకు మాత్రం కచ్చితంగా మంత్రి పదవి ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మంత్రి పదవులపై సీనియర్ నాయకులంతా గంపెడాశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు. మంగళవారం జరిగిన కూటమి ఎంఎల్‌ఎల సమావేశంలో చంద్రబాబును తమనేతగా ఎన్నుకోవడం, కూటమి నాయకులంతా ఆ వెంటనే గవర్నర్‌ను కలవడం చకచకా జరిగిపోయాయి. ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్‌డిఎ కూటమిని గవర్నర్ ఆహ్వానించడం సైతం జరిగింది. మంత్రుల జాబితాపై సైతం వెంటనే స్పష్టత వస్తుందని అంతా ఎదురుచూశారు. అయితే అలా జరగలేదు. మంగళవారం అర్ధరాత్రికి పేర్లు ప్రకటించే అవకాశం ఉందని, చంద్రబాబు స్వయంగా మంత్రులుగా ఎంపిక చేసిన వారికి ఫోన్లు చేస్తారని తెలిసింది. దీంతో తమ నాయకుని పేరు మంత్రి మండలి జాబితాలో ఉంటుందా, లేదా అని వారి అనుయాయులు తీవ్ర ఉత్కంఠకు గురవుతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో తొలి జాబితాలో పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలో ముగ్గురికి మంత్రిపదవులు దక్కాయి. ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని, ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ రంగనాథరాజు, కొవ్వూరు ఎంఎల్‌ఎ తానేటి వనితకు మంత్రి పదవులు దక్కాయి. రెండోసారి మంత్రివర్గ విస్తరణంలో ఆళ్ల నాని, రంగనాథరాజు మంత్రి పదవులు కోల్పోగా, తణుకు ఎంఎల్‌ఎ కారుమూరి నాగేశ్వరరావు, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ కొట్టు సత్యనారాయణకు మంత్రిపదవులు దక్కాయి. వైసిపి ఐదేళ్లపాలనలో పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలో ముగ్గురు మంత్రులుగా కొనసాగారు. టిడిపి ప్రభుత్వంలో జిల్లాకు ఎన్ని మంత్రిపదవులు దక్కుతాయననే చర్చ సర్వత్రా నడుస్తోంది.

అలకలకు అవకాశం

సీనియర్ నాయకులంతా మంత్రి పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఒకవేళ మంత్రి పదవి రాకపోతే అలకలు, ఆగ్రహాలు వ్యక్తమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మంత్రి పదవి ఆశిస్తున్నారు. పితాని, బొమ్మిడి నాయకర్ వంటివారు ఆ జాబితాలో ఉన్నారు. ఒకవేళ పదవి దక్కకపోతే వీరంతా అలకబూనే అవకాశం కనిపిస్తోంది. ఇలాంటి వారితో చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడి బుజ్జగించే అవకాశం ఉందని చెబుతున్నారు. బుధవారం ఏం జరుగుతుందో వేచిచూడాలి.




ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్

మంత్రివర్గ ప్రమాణస్వీకారం ప్రత్యక్ష ప్రసారం
జిల్లాలో పలు ప్రాంతాల్లో భారీ స్క్రీన్లు ఏర్పాటు

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర నూతన మంత్రివర్గం బుధవారం కొలువుదీరనుంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఇతర మంత్రివర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం గన్నవరం సమీపంలోని కేసరిపల్లి వద్ద ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పలు ప్రాంతాల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రజలు వీక్షించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఈ ప్రత్యక్ష ప్రసారం ప్రారంభం కానుంది. జిల్లా కేంద్రమైన ఏలూరులో ఇండోర్ స్టేడియం, పేరయ్య కోనేరు రామకోటి వద్ద భారీ ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెంలోని ఆలపాటి గంగాభవాని కళ్యాణ మండపంలో, నూజివీడులో రోటరీ కళ్యాణ మండపంలో ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. వీటితోపాటు ఆయా మండల కేంద్రాల్లో తహశీల్దార్, ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయాల్లో టీవీ స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారం తిలకించేందుకు ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో పలు జిల్లా ప్రభుత్వ భవనాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. కలెక్టరేట్ కాంప్లెక్స్, ఆర్ఆర్‌పేటలోని విద్యుత్ సౌధ మంగళవారం రాత్రి నుంచే విద్యుత్ వెలుగులతో కాంతులీనుతున్నాయి.



రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో కలెక్టరేట్

అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ పేరుతో ఆర్‌టిసి ఉద్యోగులపై విధించిన అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని కోరుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం స్థానిక ఆర్‌టిసి గ్యారేజీ వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.సురేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొని సమస్యలు ప్రస్తావిస్తే అది ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు ఎలా అవుతుందని ప్రశ్నించారు. సుందరయ్య ఏ పార్టీకీ ఎన్నికల్లో ప్రచారం చేయలేదని, పోటీ చేసిన అభ్యర్థులకు ఓటు వేయాలని కోరలేదని, అయితే యాజమాన్యం అక్రమంగా, అన్యాయంగా సస్పెన్షన్ చేసిందని విమర్శించారు. ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలపై నికరంగా, నిజాయతీగా పని చేస్తున్న సుందరయ్యను దురుద్దేశపూర్వకంగా యాజమాన్యం సస్పెండ్ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్‌ను అడ్డు పెట్టుకుని గత ప్రభుత్వ మెప్పు కోసం చేసిన అక్రమ సస్పెన్షన్ తప్ప మరొకటి కాదన్నారు. సుందరయ్య అక్రమ సస్పెన్షన్ వెంటనే రద్దుచేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా చలో ఏలూరుకు పిలుపునిస్తామని అన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకులు ఎస్ఎన్.రమేష్ మాట్లాడుతూ ఏలూరు డిపిటిఒ ఆర్‌టిసి ఉద్యోగులపై, నాయకులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలని, ఆయన చేయిస్తున్న అక్రమ సస్పెన్షన్లు ఆపాలని అన్నారు. ఉద్యోగుల హక్కులను కాపాడాల్సిన జిల్లా అధికారి ఇలా వ్యవహరించడం తగదని హితవు పలికారు. ఆర్‌టిసిలో అక్రమ సస్పెన్షన్లపై న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి టిపిఆర్.దొర మాట్లాడుతూ జిల్లాలో చిన్న చిన్న కారణాలకు సైతం ఉద్యోగులను యథేచ్ఛగా సస్పెన్షన్లు, రిమూవల్స్ చేస్తున్నారన్నారు. అప్పీళ్ల పరిష్కారంలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్ల ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరు డిపిటిఒ ఆర్‌టిసి ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలని కోరారు. ఈ నిరసనలో సిఐటియు నాయకులు బి.సోమయ్య, గోపీ, రైతుసంఘం నాయకులు కె.శ్రీనివాస్, అంగన్వాడీ నాయకులు కె.విజయలక్ష్మి, అరుణకుమారి, వివిధ డిపోల నుండి ఆర్‌టిసి నాయకులు పాల్గొన్నారు.



ధర్నాలో నినదిస్తున్న నేతలు

ఎన్‌సిసితో మంచి క్రమశిక్షణ, ఉజ్వల భవిష్యత్తు
వార్షిక శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

సంకల్ప బలం, క్రమశిక్షణ ఉంటే జీవితంలో ఏమైనా సాధించొచ్చని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. మంగళవారం పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఎన్‌సిసి వార్షిక శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జీవితంలో క్రమశిక్షణ అనేది ఎంతో ముఖ్యమని, విద్యార్థి దశ నుండి క్రమశిక్షణ అలవాటు చేసుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. క్రమశిక్షణ, సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవడంతోపాటు సమస్య ఎదురైనప్పుడు కంగారు పడకుండా ఆ సమస్య నుండి బయటపడేలా ఆలోచన చేయాలన్నారు. ఈ సందర్భంగా తన శిక్షణా సమయంలో హవల్దార్ సత్యరాజ్ అందించిన స్ఫూర్తిని ఎప్పటికీ మరువలేనన్నారు. తన జీవితకాలంలో సంభవించిన వివిధ పరిణామాలను వివరిస్తూ ప్రతిఒక్కరి జీవితంలో జారుడుమెట్లు ఉంటాయని, దాంతో కుంగిపోకుండా సానుకూల దక్పథంతో ముందుకెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. ఎన్‌సిసి నేర్పే వాటిలో ముఖ్యమైంది టీమ్ స్పిరిట్ అని అన్నారు. ఒకరికొకరు సహాయపడే అలవాటును కూడా పెంచుకోవాలని, ఇదే సమయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ పెంచుకోవడం ద్వారా భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎన్‌సిసి విద్యార్థులుగా రిపబ్లిక్‌డే పెరేడ్‌లో పాల్గొనే అవకాశం వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దని ఆయన హితవు పలికారు. సి సర్టిఫికెట్ పొందడం ద్వారా ఉద్యోగావకాశాలను ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆయుధాల ఉపయోగంలో మెళకువతో శిక్షణ పొందాలని ఎన్‌సిసి విద్యార్థులకు ఆయన సూచించారు. శిక్షణా సమయంలో వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకునేందుకు జీవననైపుణ్యం, జాతీయ సమైక్యత, జాతినిర్మాణం అనే అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తొలుత ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్.ముఖర్జీ స్వాగతోపన్యాసం చేశారు. గోదావరి వరదల సమయంలో బాధితులను ఆదుకోవడంలో ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ వైఎస్ఎస్.చంద్రశేఖర్, పెదవేగి తహశీల్దార్ సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

మోటారు సైకిల్, కారు ఢీ
ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు మండలం మీర్జాపురం వద్ద ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన మైనం అశోక్ (55), కొండేటి ఆదిశేషు (63) నూజివీడు మండలం జంగంగూడెం గ్రామంలో ఫంక్షన్‌కు మంగళవారం హాజరయ్యారు.అక్కడ నుంచి కపిలేశ్వరపురం తిరుగు ప్రయాణమవ్వగా మీర్జాపురం గ్రామం వద్దకు వచ్చేసరికి అతివేగంగా వచ్చిన కారు వీరి మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అశోక్, ఆదిశేషు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నూజివీడు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన కారు, పక్కనే మృతదేహాలు

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన
నిలిచిపోయిన రాకపోకలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని తిరుమలదేవిపేట ఎస్‌సి కాలనీకి చెందిన మహిళలు, గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేపట్టారు. జంగారెడ్డిగూడెం - చింతలపూడి రోడ్డు నిర్బంధించి ఆందోళన చేశారు. దీంతో కొద్దిసేపు ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని నినాదాలు చేశారు. అనంతరం కాలనీవాసులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తమ ఇళ్లకు బురద నీరు సరఫరా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బురదనీరు తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆందోళన కారులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరు నుంచి బురద నీరు ఇళ్లకు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటామని, అప్పటి వరకు సమీప రైతు పొలంలోని బోరు నీటిని ఇళ్లకు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న మహిళలు, గ్రామస్తులు

పదో తరగతిలో అధిక ఉత్తీర్ణతే లక్ష్యం
డిఇఒ ఎస్.అబ్రహాం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణతా శాతం సాధనే లక్ష్యంగా ఈ సంవత్సరం పక్కా ప్రణాళికతో ముందుకు సాగనున్నట్లు డిఇఒ ఎస్.అబ్రహం తెలిపారు. ఈ నెల 13 నుంచి పాఠశాలలు పున:ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయనను ప్రజాశక్తి పలుకరించింది. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లా ఉత్తీర్ణతాశాతం 8018గా ఉందని, రాష్ట్రస్థాయిలో దిగువ స్థానంలో ఉన్నామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఉత్తీర్ణతా శాతం పెంచేలా విద్యా సంవత్సరం ఆరంభం నుంచి ప్రత్యేక శ్రద్ధ కనబర్చనున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1818 పాఠశాలలు 13న తెరుచుకోనున్నాయని, లక్షా 56 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యశిస్తున్నారని తెలిపారు. పదో తరగతి విద్యార్థులతోపాటు ఇతర తరగతుల్లోని విద్యార్థుల స్థాయి పెంచేందుకు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో కలిసి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం స్టూడెంట్ కిట్ పేరుతో విద్యార్థులకు అందించే స్కూల్ బ్యాగ్, బూట్లు, సాక్సులు, టై, బెల్టు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, మరో మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో కిట్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. స్కూళ్లు తెరిచిన రెండు, మూడు రోజుల్లో విద్యార్థులకు ఈ కిట్లను విద్యార్థులకు పంపిణీ పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, పాఠశాలలు ప్రారంభమైన నాలుగైదు రోజుల వరకు అడ్మిషన్లు కొనసాగుతాయని తెలిపారు.



దుర్గంధభరితంగా ఏలూరు నగరం
నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగర పాలక సంస్థ, సచివాలయ సెక్రెటరీలు, శానిటరీ మేస్త్రిలు, ఇన్స్‌పెక్టర్ల పనితీరు సరిగా లేక ఏలూరు నగరం దుర్గంధ నగరంగా తయారైందని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని పాత కౌన్సిల్ హాల్‌లో 79 సచివాలయాల సెక్రటరీలు, సానిటరీ ఇన్స్‌పెక్టర్లు, మేస్త్రిలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ మాట్లాడుతూ నగరపాలక సంస్థ శానిటేషన్ సిబ్బంది ప్రజలకు సేవ చేయడం కన్నా హోటల్స్, బ్రాందీ షాపుల వద్ద, ఇళ్లు, బిల్డింగులు నిర్మాణాల వద్ద రబ్బీసును తీసుకువెళ్లడానికి, ఇళ్ల వద్ద నరికి పడేసిన చెట్లు, చెత్తాచెదారాన్ని తీసుకు వెళ్లడానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారని సిబ్బందిపై ఇరువురు మండిపడ్డారు. సానిటరీ సెక్రెటరీలు ఉండే సచివాలయాలు ఎంతో అపరి శుభ్రంగా ఉన్నాయన్నారు. సచివాలయాల సెక్రటరీల పనితీరుకు సచివాలయాలే నిదర్శనం అన్నారు. ప్రభుత్వం మారింది గతంలో లాగా పనిచేస్తే మీ ఉద్యోగాలకు భద్రత ఎవరు కల్పించలేరన్నారు. నగరంలో కుక్కలు పెరిగిపోయాయి వాటిపై చర్యలు లేవు అన్నారు. ఫాగింగ్ సరిగా చేయని కారణంగా నగరంలో దోమలు పెరిగిపోయాయన్నారు. సిబ్బంది వారిపై సూపర్వైజర్ చేసేవారు ఉన్నప్పటికీ కూడా పారిశుధ్యం విషయంలో ఫలితం కనబడటంలేదన్నారు. పారిశుధ్యం పెరిగిపోవడం వల్ల పర్యావరణం పూర్తిగా పాడైపోయిందని, చిత్తశుద్ధితో సిబ్బంది పనిచేయడం లేదనేది కచ్చితంగా అర్థమవుతుందని తెలిపారు. పనిచేయకుండా కాలక్షేపం చేస్తున్న వారిపై చర్యలు తప్పవని, వారిని ఎవ్వరూ కాపాడలేరని కో-ఆప్షన్ సభ్యులు పెదబాబు, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ హెచ్చరించారు. ఈ రివ్యూ సమావేశంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, ఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.మాలతి, మున్సిపల్ సెక్రటరీ దివ్య కుమారి, ఇన్‌ఛార్జి ఎంఇ డి.కొండలరావు, డిఇ తాతబ్బాయి, ఎఇలు రాఘవేణి, రఫీ, సాయి, సానిటరీ ఇన్స్‌పెక్టర్లు, మేస్త్రిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎంఆర్ పెదబాబు

కాపుగూడెంలో విష జ్వరాలు విజృంభణ
20 మందికి పైగా జ్వరాలతో ఉన్నట్టు అంచనా

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని టి.నరసాపురం పంచాయతీ పరిధిలో ఉన్న కాపుగూడెంలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామంలో 20 మందికి పైగా జ్వరాలతో బాధపడుతున్నారని, ఇప్పటికే 15 మంది వరకూ జ్వరంతో ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆరోగ్యాన్ని పొందుకున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో ప్రబులుతున్న అనారోగ్య పరిస్థితులను బట్టి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు అంటున్నారు. ఇంటికి ఒకరు జ్వర పీడితులుగా ఉన్నారని, వైద్యులు సరైన వైద్య సదుపాయాలు అందించడం లేదని తెలిపారు. ప్రయివేటు ఆసుపత్రికి వెళ్తే రూ.వేలల్లో హెచ్చించాల్సి వస్తుందని కొందరు వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఇంటి వద్దే చికిత్స తీసుకుంటున్నామని చెబుతున్నారు. వెంటనే వైద్య బృందం స్పందించి గ్రామంలో ఉన్న అనారోగ్య బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వారు కోరుతున్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి : ఎపిఒ

ప్రజాశక్తి - ముసునూరు

ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటినట్లయితే భవిష్యత్తు తరాల వారికి ఆదర్శప్రాయమని ఎపిఒ టి.రోజ్‌లీలా తెలిపారు. మంగళవారం మండలంలోని లోపూడి, చెక్కపల్లి తదితర గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా మొక్కల నాటడం కార్యక్రమం చేపట్టారు. పలు విధాలుగా మొక్కలు పెంపకం ఆదర్శదాయకమని, ప్రతి మనిషి తప్పనిసరిగా తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఒక మొక్క నాటాలని ఆమె ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించారు.



ఉపాధి కూలీలతో కలిసి మొక్కలు నాటుతున్న ఎపిఒ

కార్మికుల భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం పదిలం

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - నూజివీడు

కార్మికుల భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం పదిలమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. నూజివీడు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజు అధ్యక్షతన సిపిఎం శ్రేణులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం, ఆశయాలు, లక్ష్యాలు, ప్రజల తరపున చేసిన పోరాటాలను, సాధించిన విజయాలను వివరించారు. కార్మికులను సంఘటిత పరచి వారి సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసి సాధించిన ఘన చరిత్ర సిపిఎంకి ఉందన్నారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ప్రకారమే ముందుకు సాగుతుందని తెలిపారు.

13న రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈనెల 13వ తేదీన గురువారం ఉదయం 10 గంటలకు గ్రామ రెవెన్యూ అధికారుల రాష్ట్ర అత్యవసర సమావేశం గాంధీనగర్, ప్రెస్ క్లబ్ విజయవాడలో ఏర్పాటు చేయడం జరిగిందని, కావున రాష్ట్ర ఆఫీస్ బేరర్స్, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులందరూ తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈనాడు అధినేత రామోజీ రావు అకాల మరణం వల్ల ఈనెల 9వ తేదీన జరుపుకోవాల్సిన రాష్ట్ర కమిటీ సమావేశం వాయిదా వేయడం జరిగిందని, 12వ తేదీన నూతన ప్రభుత్వం ప్రమాణ స్వీకారం వుంది కాబట్టి మరుసటిరోజు ఈ సమావేశం ఏర్పాటు చేయటం జరిగిందని వారు తెలిపారు.


కొడాలి వినోద్‌ను కలిసి అభినందిస్తున్న పాస్టర్లు

వినోద్‌కు పాస్టర్లు అభినందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాస్టర్స్ మంగళవారం నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌ఛార్జి కొడాలి వినోద్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ముదినేపల్లిలోని ఎన్‌డియే కార్యాలయం వద్ద కొడాలి వినోద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో కామినేని శ్రీనివాస్ గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధ కళాకారులను ఆదుకోవాలి

ప్రజానాట్య మండలి సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ టివిఎస్.రాజు

ప్రజాశక్తి - కామవరపుకోట



పేద, వృద్ధ రంగస్థల కళాకారులకు ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ వైద్య ఖర్చులు కూడా సరిపోవడం లేదని ఎపి ప్రజానాట్య మండలి సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ టివిఎస్.రాజు తెలిపారు. కళాకారులు రంగస్థలంపై బహుముఖ కళారూపాలు ప్రదర్శించి లక్షలాది మంది ప్రేక్షకుల ఆదరణ, అభిమానులను, వివిధ రకాల అనేక అవార్డులని స్వీకరించి జీవితం ఆఖరి దశలో ఆకలి మంటలతో, అనారోగ్యంతో అల్లాడిపోతున్నారన్నారు. టిడిపి సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు వృద్ధ కళాకారులకు కనీసం నెలకు రూ.7 వేలు పెన్షన్ ఇచ్చి నిరుపేద వృద్ధ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లోకేష్‌కు అభినందనలు

కొడాలి వినోద్

ప్రజాశక్తి - ముదినేపల్లి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మంగళవారం కైకలూరు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ ఇన్‌ఛార్జి కొడాలి వినోద్ కలిసి అభినందనలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డియే కూటమి తిరుగులేని మెజార్టీ సాధించి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఉండవల్లి నివాసం వద్ద లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


లోకేష్‌ను ఆలింగనం చేసుకున్న వినోద్

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆర్‌టిసి బస్సు, స్కూటీ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మధ్యాహ్నం ముదినేపల్లిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గుడివాడ ఆర్‌టిసి డిపోకు చెందిన బస్సు బంటుమిల్లి వెళుతుంది. బస్సు ముదినేపల్లి అంబేద్కర్ కాలనీ వద్దకు రాగానే ముదినేపల్లి నుంచి గుడివాడ వెళుతున్న స్కూటీ, బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండలంలోని పేరూరుకు చెందిన ఎలక్ట్రీషియన్ బొర్రా బాజీ(45)కి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం జాతీయ రహదారిపై జరగడంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని చికిత్సకై 108 వాహనంలో గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాజీ పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు.

బైకులు ఢీ కొని వ్యక్తులకు గాయాలు

ప్రజాశక్తి - ముసునూరు

రెండు బైకులు ఢీ కొని వ్యక్తులకు గాయాలైన సంఘటన నూజివీడు పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే.. నూజివీడు రూరల్ మీర్జాపురం గ్రామం వద్ద గుడివాడ పట్టణానికి చెందిన ఇరువురు బైక్‌పై వెళుతూండగా మలవల్లి స్పిన్టెక్స్ కంపెనీలో పని ముగించుకుని ఇంటికి తిరుగు ప్రయాణంలో ఇరువురు ఒకరినొకరు రెండు బైకులు ఢీకొనడంతో నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలంలో ఉన్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ సహాయ దృక్పథంతో స్పందించి సమయానుకూలంగా 108కు సమాచారం అందించి నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ముదినేపల్లిలో చోరీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం స్థానిక పూర్ణిమ థియేటర్ సమీపంలోని ఆటోనగర్ రాజేష్ ఫౌండ్రిలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఫౌండ్రీలోని 5 హెచ్‌పి మోటర్, గేర్ బాక్స్‌లు రెండు ఎత్తుకు పోయారు. మంగళవారం ఉదయం ఫౌండ్రీకి వచ్చిన రాజేష్ ఫౌండ్రిలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన విద్యాబోధన గురుకులంతోనే సాధ్యం

ఎపి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కె.ప్రవీణ




ప్రజాశక్తి - ముసునూరు

ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ముసునూరు ఎపి గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కె.ప్రవీణ తెలిపారు. ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లాలోనే ఉన్నత శిఖరం అధిరోహించిన ముసునూరు ఎపి గురుకుల బాలికల పాఠశాల అందరి మన్ననలను పొందుతుందన్నారు. గత ఇరవై సంవత్సరాల నుంచి ఎన్నో ప్రతిభా అవార్డులు పొందిన సందర్భాలు కలవని తెలిపారు. 2023-24 బ్యాచ్ పదో తరగతిలో 79 మంది విద్యార్థులకు గాను 79 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. చిట్టి పావని 577 మార్కులు సాధించి మండలం ప్రథమ స్థానంలో నిలవడంతో పాటు తెలుగు, లెక్కలు, సోషల్‌లో 100కి 100 మార్కులు సాధించారన్నారు. కె.హాసిని 572 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో, జి.వెన్నెల 570 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిల్చారు. 600 మార్కులకు గాను 550 మార్కులు సాధించిన వారు పది మంది, 500 మార్కులు సాధించిన వారు 42 మంది, 450పైగా మార్కులు సాధించిన వారు 27 మంది కలరన్నారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ఇంగ్లీష్ మీడియంలో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు మంచి ప్రావీణ్యం కలిగిన ఉపాధ్యాయులచే విద్యా భోధన, నాణ్యమైన భోజనంతో పాటు సకల సౌకర్యాలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. సౌకర్యవంతమైన భోజన శాలలు, సువిశాలమైన తరగతి గదులు, చక్కని లైబ్రరీ, విశాలమైన ఆటస్థలం, ప్రతిరోజు సాయంత్రం వేళల్లో ఆటలు ఆడించడంతో పాటు ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇలా తర్ఫీదు పొందిన వారు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి పలు క్రీడాపోటీల్లో తమ ప్రతిభ కనబరిచి అవార్డులు, రివార్డులు సాధించారన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 నిల వరకు తరగతులు నిర్వహించడం, అనంతరం భోజన విరామం, మరలా మధ్యాహ్నం 2.30నిల నుంచి 4.30నిల వరకు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పుస్తక పఠనం వుంటుందన్నారు. ఇచ్చట ప్రభుత్వం అందిస్తున్న సకల సదుపాయాలతో విద్యార్థులకు మంచి చదువును అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.



గురుకుల బాలికల పాఠశాల


చిట్టి పావని


నారాయణపురంలో మురుగుకాలువలో పూడిక తీత పనులు

మురుగుబోదెలో పూడిక తీత పనులు


ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం సచివాలయం-2 పరిధి ఎస్‌సి కాలనీ, వైఎస్ఆర్-బి బ్లాకు సమీపంలో మురుగు కాలువలో తూడును జెసిబి సాయంతో తొలగించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా మురుగునీటి పారుదలకు ఆటంకం రాకుండా పూడికతీత తీయిస్తున్నామని సర్పంచి అలకనంద తెలిపారు.

వ్యక్తిగత దూషణలకు, ఘర్షణలకు పాల్పడొద్దు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఎంతో క్రమశిక్షణతో పార్టీ కోసం అంకితభావంతో పనిచేశారని, ఇకపై అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి వ్యక్తిగత దూషణలకు, ఘర్షణలకు పాల్పడవద్దని జనసేన జిల్లా అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పల నాయుడు అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన రెడ్డి అప్పల నాయుడును మంగళవారం చెంచుల కాలనీలోని వారి స్వగృహంలో, ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలోను హేలాపురి ఓల్డ్ మెటీరియల్ వెల్ఫేర్ సభ్యులు, పలు డివిజన్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ కూటమి ఇచ్చిన హామీలు అన్నీ త్వరలోనే అమలవుతాయని చెప్పారు. పార్టీ ప్రయోజనాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి కష్టపడిన ప్రతి ఒక్క నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలుపుతున్నానని, రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హేలాపురి ఓల్డ్ మెటీరియల్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జి.సాంబమూర్తి, పిన్నింటి మహేష్, అధ్యక్షులు లక్ష్మి అప్పారావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో జనసేన కార్యకర్తలతో రెడ్డి అప్పలనాయుడు

తొలి విడత ప్రవేశాలు ప్రారంభం

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సజని



ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పోలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ తొలి విడత ప్రవేశాలు మే 22వ తేదీ నుంచి ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.సజని తెలిపారు. ఈ సందర్భంగా కాలేజి ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇప్పటికే పదో తరగతి ఫలితాలు ప్రకటించినందున మార్కుల మెమో, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టిసి) ఆధారంగా విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024వ సంవత్సరంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంకు సంబంధించి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పోలవరం జూనియర్ కళాశాల ఉత్తీర్ణతా శాతంలో అగ్రగామిగా నిలిచిందని, ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ కలిపి జిల్లాలో మూడో స్థానంలో పోలవరం ప్రభుత్వ కళాశాల ఉత్తీర్ణ శాతంలో ఉందని అన్నారు. కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్‌ఇసి నాలుగు జనరల్ గ్రూప్స్ కలవని, ప్రతి గ్రూపుకు తెలుగు, ఇంగ్లీష్ మీడియం అవకాశం ఉందని, ప్రతి సబ్జెక్టుకు అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారన్నారు. ప్రతి క్లాస్ రూమ్‌లో ఐఎఫ్‌సి బ్యానర్స్, డిజిటల్ బోర్డ్స్ కల్పించబడ్డాయని, ఎంపిసి, బైపిసికి సంబంధించి ల్యాబ్ సదుపాయం కూడా ఉందన్నారు. క్లాస్ రూమ్‌లు, మరుగుదొడ్లు, మంచి క్రీడా మైదానంతో ప్రభుత్వ కాలేజీలో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కూడి ఉన్నాయని తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం క్లాసులు ప్రారంభమయ్యాయని, ఫస్ట్ ఇయర్ తొలి విడత ప్రవేశాలు ప్రారంభించబడ్డాయని, ఆగస్టు వరకూ ప్రవేశాలు జరుతాయని తెలియజేశారు. పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన తమ పిల్లలను తల్లిదండ్రులు మంచి విద్యాబోధన, అన్ని రకాల సదుపాయాలతో కూడిన ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కాలేజి ప్రిన్సిపల్ కె.సజని కోరారు.



కళాశాల భవనం..

తాగునీటికి ప్రజలు విలవిల

సమస్య పరిష్కరించాలని వేడుకోలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణంలో జలజీవన పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేశామని చెప్పుకున్న అధికారుల మాటలు కేవలం రికార్డులకే పరిమితమైయ్యాయి. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి పూర్తి భిన్నంగా ఉందని, మండు వేసవిలో ప్రజలు మంచినీటి కోసం విలవిల్లాడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పల మెట్ట, గాంధీనగర్ పరిసర ప్రాంత ప్రజలు తీవ్రమైన మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నామని, తాగునీరు ఎప్పుడు వస్తుందో రాదో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.


ప్రజల కనీస అవసరాలు తీర్చుకొనుటకు కూడా నీళ్లు రాని పరిస్థితి నెలకొందని, ఎప్పుడో రెండు రోజులకు ఒకసారి కుళాయిల ద్వారా, ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు తప్ప, ఏ రోజు క్రమం తప్పకుండా నీరు వచ్చిన పరిస్థితి లేదని వాపోయారు. ఈ విధంగా ఉంటే నీటిని ఏ సమయంలో సరఫరా చేస్తున్నారో ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొందన్నారు. దీనివల్ల తాము బహిరంగ మార్కెట్‌లో తాగునీటి అవసరాల కోసం ఒక టిన్నుకు రూ.10 నుంచి 20 ఖర్చు చేసి మంచి నీళ్లను కొనుక్కోవలసిన పరిస్థితి ఉందని, పేద, మధ్యతరగతి ప్రజలమైన తాము నెలకు రూ.300 వరకూ మంచినీళ్ల కోసం ఖర్చు చేయవలసి రావడం ఆర్థికంగా భారంగా మారిందని అన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తాగునీటి ఎద్దడి నివారణ కోసం తగు చర్యలు తీసుకొని నీటిని సరఫరా చేయాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు.



దయనీయంగా అంగన్వాడీ కేంద్రాలు

కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కరించాలంటున్న అంగన్వాడీలు


పూర్తికాని భవనంలో కేంద్రాన్ని నడుపుతున్న అంగన్వాడీ


నిర్మాణంలో భవనం..

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని లక్కవరం గ్రామపంచాయతీ పరిధిలోని లక్కవరం గ్రామంలో అంగన్వాడీ కేంద్రాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. దీనికి ప్రధాన కారణం గత ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యమేనని స్థానిక ప్రజలు అంటున్నారు. గ్రామపంచాయతీ సమీపాన ఉన్నటువంటి అంగన్వాడీ కేంద్రం అత్యంత దారుణంగా ఉంది. అంగన్వాడీ కేంద్రం నిర్మాణం పూర్తయినా కూడా పిల్లలు అంగన్వాడీ కేంద్రంలోకి వెళ్లడానికి కనీసం మెట్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో పిల్లలు ఇబ్బంది పడుతారని సిమెంట్ రాళ్లు వరుసగా పేర్చి ఆ రాళ్లపై నుంచి పిల్లల రాకపోకలు సాగించాలి. ఆ రాళ్లపై స్లిప్ అయి పడితే పిల్లలకు ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉంది.

అంగన్వాడీ కేంద్రాలకు విడుదలైన నిధులు ఎక్కడికెళ్లాయని, అసంపూర్తిగా కట్టి వదిలేశారా అనేది ప్రశ్నార్థకం. వేరే అంగన్వాడీ కేంద్రంలో పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న భవనంలో నిర్మాణం చేపట్టి ఐదు సంవత్సరాల కాలం గడుస్తున్నా ఇంకా పూర్తికాక లోపలి భాగం అంతా అస్తవ్యస్తంగా ఉంది. కుక్కలు, పందులు అంగన్వాడీ కేంద్రాలకు చేరి దుర్వాసనకు దర్శనమిస్తున్నాయి. నిర్మాణ పూర్తి కావస్తదో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రం నిర్వహణ చాలా కష్టంగా ఉందని అంగన్వాడీ కార్యకర్తలు తమ బాధని వెలబుస్తున్నారు. తరుచూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా నిర్మాణం పూర్తి కావడం లేదని అంటున్నారు.

గ్రామంలోని మరొక అంగన్వాడీ కేంద్రంలో బాత్రూం శిథిలావస్థలో దర్శనమిస్తోంది. కనీసం డోర్స్ లేవు, బాత్రూం చూడడానికి తప్ప, చెత్తాచెదారం చేరి పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా తయారైంది. మరమత్తు చేయమని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఇదిగో అదిగో అంటున్నారు తప్ప పని మాత్రం శూన్యం అని అంగన్వాడీ టీచర్లు వాపోతున్నారు. ఒక లక్కవరం పంచాయతీలోని అంగన్వాడీ కేంద్రంలో ఇన్ని సమస్యలు ఉన్నా.. రాష్ట్రంలో ఉన్నటువంటి అంగన్వాడీ కేంద్రాల్లో ఎన్ని సమస్యలు ఉనాయో. కొత్త ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కరించి, నూతన భవన నిర్మాణ సౌకర్యాలు చేపట్టి, అంగన్వాడీ కేంద్ర సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని అంగన్వాడీలు, సహాయకులు కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న భవనం..

ప్రజా తీర్పును గౌరవిస్తా..

మాజీ ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రజా తీర్పును గౌరవిస్తానని, ఊపిరి ఉన్నంత వరకూ ప్రజా సేవే లక్ష్యంగా, కార్యకర్తలకు అండగా కలిసి పనిచేస్తానని మాజీ ఎంఎల్ఎ వాసుబాబు అన్నారు. భువనపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో వాసుబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తానన్నారు. ఇకముందు పార్టీ బలోపేతానికి మనమంతా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

జారిపడి మంత్రి వర్మ తండ్రికి గాయాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తండ్రి సూర్యనారాయణరాజు తన నివాసంలో జారిపడి స్వల్ప గాయాల పాలయ్యారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం భీమవరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చేర్చారు. ఈ విషయం తెలియగానే శ్రీనివాస్ వర్మ హుటాహుటీన ఢిల్లీ నుంచి భీమవరం చేరుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తండ్రిని పరామర్శించారు. వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రమంత్రి పదవి స్వీకరించిన తర్వాత శ్రీనివాస్ వర్మ తొలిసారి భీమవరం రావడంతో బిజెపి, టిడిపి నాయకులు పెద్దఎత్తున ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, బిజెపి నేత పాకా వెంకట సత్యనారాయణ, టిడిపి నేతలు కోళ్ల నాగేశ్వరరావు వర్మను కలిసిన వారిలో ఉన్నారు.

డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మంగళవారం తెలిపారు. కాలేజీలో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలూ అందుతాయన్నారు. అన్ని సబ్జెక్టులకూ సంబంధించిన లెక్చరర్లు పూర్తిస్థాయిలో ఉన్నారని చెప్పారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలూ ఏర్పాటు చేశామన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేర్పించాలని కోరారు.

లక్ష్మమ్మ పోరాట స్ఫూర్తి పలువురికి ఆదర్శం

సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు

ప్రజాశక్తి - యలమంచిలి

1977 - 80 మధ్యకాలంలో చించినాడ గ్రామంలో భూస్వాములకు, పేదలకు మధ్య జరిగిన మహా పోరాటంలో లక్ష్మమ్మ చూపిన పోరాటపటిమ పలువురికి ఆదర్శమని సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అన్నారు. చించినాడ పోరాట నాయకురాలు లక్ష్మమ్మ ద్వితీయ వర్ధంతి సభ మంగళవారం లక్ష్మమ్మ స్వగృహం వద్ద నిర్వహించారు. ఈ సభకు సిపిఎం నాయకులు వల్ల ఏడుకొండల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సభలో బాలరాజు మాట్లాడుతూ చించినాడ మహాపోరాటం సందర్భంగా అప్పటి కాంగ్రెస్ నాయకత్వంలో గ్రామంలోని సిపిఎం నాయకులు, పోరాట నాయకులందరినీ జైల్లో నిర్బంధించి భయభ్రాంతులకు గురిచేసినా కూడా ఆనాడు మహిళలు సాగించిన పోరాటం ఎంతో ఆదర్శనీయమన్నారు. ఆ పోరాటంలో లక్ష్మమ్మ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మమ్మ కుమారులు విప్పర్తి కన్నందాసు, విప్పర్తి నాగేశ్వరరావు, లక్ష్మమ్మ మనవలు విప్పర్తి అవినాష్ (నన్ని), విప్పర్తి నాని, సిపిఎం నాయకులు మొమ్మిడివరపు ఆంజనేయులు, గోగినేని శ్రీనివాస్, తెన్నేటి స్టాలిన్ పాల్గొన్నారు.